ముందే చేరిన విద్యా కానుక

● పాఠశాలలు తెరిచే రోజే పంపిణీకి సిద్ధం
● విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం

కోసిగి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు పెద్దపీట వేశారు. అందులో భాగంగా అధికారంలోకి వచ్చాక జగనన్న విద్యాకానుకలు పాఠశాల ప్రారంభం రోజునే అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. 2023–2024 విద్యా సంవత్సరానికి గానూ విద్యాకానుకలు కోసిగికు ఇప్పటికే వచ్చి చేరాయి. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 13, ప్రాథమికోన్నత–2, ప్రాథమిక పాఠశాలలు 33, ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఒక మోడల్ స్కూల్ ఉన్నాయి. ఇందులో 1 నుంచి 10వ తరగతి వరకు 14,565 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకుగానూ జగనన్న విద్యా కానుకల కింద విద్యార్థులకు 1.27లక్షల పాఠ్య పుస్తకాలు అవసరం కానున్నాయి. ఇప్పటి వరకు 80,605 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. బ్యాగులు 15,485, బాలురకు బూట్లు 7,895, బాలికలకు 7,573, సాక్స్‌లు 30,936 వచ్చి చేరాయి. ఇంకా రెండో విడితలో మిగిలిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, నోటు పుస్తకాలు, బెల్టులు రావాల్సి ఉంది.

సర్కారు బడుల వైపు చిన్నారుల చూపు..

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సర్కారు బడులో విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. గత ప్రభుత్వ పాలనలో మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు 9,500 లోపు పిల్లలు చదువుతుండేవారు. ప్రస్తుతం మూడేళ్లుగా దాదాపు 4,500 మంది అదనంగా చేరారు. మండలంలోని ప్రభుత్వ బడులు రూపు రేఖలు మారిపోయాయి. నాడు–నేడుతో పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దుకున్నాయి. నాడు–నేడు పాఠశాలలకు అదనపు గదులు, టాయిలెట్స్ అండ్ రన్నింగ్ వాటర్, డ్రింకింగ్ వాటర్ అండ్ సప్లై, ఎలక్ట్రిషియన్, మేజర్ అండర్ మైనర్ రిపేరి, గ్రీన్ చాక్‌బోర్డు, కాంపౌండ్ వాల్, ఇంగ్లీష్ ల్యాబ్, కిచెన్ షెడ్‌లు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యా దీవెనలు అందజేయడంతో వ్యక్తం చేస్తున్నారు.


కోసిగి బాలుర హైస్కూల్‌లో నిల్వ ఉంచి పాఠ్య పుస్తకాలు


కోసిగిలో నిల్వ ఉన్న బ్యాగులు, బూట్లు


కోసిగిలో నాబార్డు నిధులతో ఏర్పాటు చేసి పాఠశాల

పాఠశాల తెరిచే రోజే విద్యాకానుకలు



ఈ విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. మొదటి రోజే మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకానుకలు అందజేయనున్నాం. ఇప్పటికే 75 శాతం విద్యా కానుకలు ఎమ్మార్సీకి వచ్చాయి. మరో వారం రోజుల్లోగా మిగిలినవి రానున్నాయి. ముందుగానే ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల వారీగా కానుకలు అందజేస్తాం. వారి ద్వారా బడి తెరిచిన రోజే విద్యార్థులకు పంపిణీ చేస్తాం.
– మొయినుద్దీన్, ఎంఈఓ, కోసిగి

క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు


ఆలయం వద్ద భక్తుల సందడి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్షేత్రం పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం, నిందితుడిని చూపుతున్న సెబ్ సీఐ సృజన్‌బాబు, సిబ్బంది

కోసిగి: మండల కేంద్రంలోని ఈశ్వర ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. వివరాలు సీఐ సోమవారం విలేకరులకు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన నరసింహులు బైక్‌పై మద్యం తరలిస్తూ తమ సిబ్బందిని చూసి బైక్, మద్యం వదిలి పారిపోయాడన్నారు. బైక్‌తోపాటు 10 బాక్స్‌లు ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీని స్వాధీనం చేసుకుని, పరారైన నిందితుడి పట్టుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఉపాధ్యాయ ఉద్యమ నేత, సీపీఎం నాయకుడు హనుమంతు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సోమవారం సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు తిప్పన్న, నాయకులు లక్ష్మన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర కోరారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. https://apms.apcfss.in https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 950 22 46367 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

108లో ప్రసవం


శిశువును చూపుతున్న ఈఎంటీ వీరేష్

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య సోమవారం తెల్లవారుజామున 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కారుమంచి గ్రామానికి చెందిన సంధ్యకు నాల్గవ కాన్పు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త పద్మా వతి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చింది. వెంటనే కారుమంచి చేరకున్న అంబులెన్స్ డ్రైవర్ మల్లికార్జున, ఈఎంటీ వీరేష్ గర్భిణిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండగా, వారిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. వెంకటరమణ చెప్పారు. సోమవారం గైనకాలజి విభాగంలో ప్రీ క్లామ్సియా డే సందర్భంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు 20 వారాల తర్వాత బీపీ 140/90 కంటే ఎక్కువగా ఉంటే ప్రీ క్లామ్సియా అంటారన్నారు. మూత్రంలో అల్బుమిన్ ప్లస్ ఉంటే కచ్చితంగా ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఇదే సమయంలో సీబీపీ, కిడ్నీ, లివర్, ఫండస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 37 వారాల దాటిన తర్వాత ప్రసవం అయ్యేటట్లు చూసుకోవాలని పేర్కొన్నారు. 20 వారాల తర్వాత కాళ్లవాపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ స్నిగ్దం, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం రోడ్డులోని పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.84,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇస్పీ ఎస్‌ఐ విజయలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన పాండు, సర్దార్‌లతో పాటు మరో 11 మంది పేకాట ఆడుతూ పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రేపు అంజన్న ఆలయ వార్షికోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన వెలిసిన అభయ ఆంజనేయస్వామి ఆలయ ర్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు రాచోటి సుధాకర్ సోమవారం తెలిపారు.

మండలానికి విద్యా కానుక కిట్లు

కౌతాళం: జగనన్న విద్యా కానుక కిట్లు మండలానికి చేరినట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 14,669 కిట్లు వచ్చాయని, బెల్టులు, షూ, యూనిఫాం త్వరలోనే వస్తాయని తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజునే వీటిని విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలానికి కావాల్సిన 53 వేల పాఠ్య పుస్తకాలకు గానూ మొదటి విడతలో 43 వేల పుస్తకాలు రాగా ఎమ్మార్సీలో భద్రపరిచామన్నారు.

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి

ఆదోని టౌన్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్పందనలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్వన్‌పేటకు చెందిన గణేష్ అక్రమ కుళాయి కనెక్షన్లు తొలగించాలని అర్జీ సమర్పించాడు. హనుమాన్‌నగర్‌కు చెందిన రమేష్ మురుగు కాలువలకు మరమ్మతులు చేయాలని విన్నవించాడు. హనుమాన్‌నగర్‌లో ఓపెన్ మురుగు కాలువలు పూడికతో నిండిపోయి కంపు కొడుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చాడు. శంకర్‌నగర్‌లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని జిలాన్‌బాషా అధికారులను కోరాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, టీపీఓ, శానిటేషన్, ఎలక్ట్రికల్ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.


అర్జీ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

వాల్మీకి విగ్రహావిష్కరణ


వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పక్కనే నాయకులు, కమిటీ నాయకులు

ఆదోని టౌన్: పట్టణంలోని కల్లుబావిలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవన విధానం అందరికీ ఆదర్శమన్నారు. వాల్మీకులు కలిసికట్టుగా ఎస్టీ రిజర్వేషన్ సాధనకు మరింతగా పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారం లోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి పార్లమెంట్‌కు పంపారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవా, మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, సింహం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

31న ఖాదర్‌లింగస్వామి ఉరుసు ప్రారంభం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు ఈనెల 31 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. సోమవారం ఆయన ఉరుసు తేదీలను ప్రకటించారు. 31న స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలతో శుభ్రచేయడం, జూన్ 1న గంధం, 2న ఉరుసు ఉత్సవాలు ఉంటాయని, 3న (సఫ్‌రాలూట్‌నా) స్వామి ప్రసాదం పంపిణీ, 4న జియారత్ వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. కాగా ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మకర్త మున్నపాషా ఇంటి నుంచి ప్రత్యేక చాదర్‌ను బ్యాండు మేళాలు డప్పువాయిద్యాల మధ్య దర్గాకు తెచ్చి ఫాతెహాలు చేశారు. ఉరుసు రోజు వరకు ప్రతి రోజు రాత్రి ఫాతెహ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.


స్వామి సమాధిని అలంకరించిన దృశ్యం

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

కర్నూలు (న్యూసిటీ) : దైనందిన జీవితంలో కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిందని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనంద రావు చెప్పారు. సోమవారం లైఫ్ సైన్స్ భవనంలోని కంప్యూటర్ ల్యాబ్‌లో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బోధనేతర ఉద్యోగులందరూ కంప్యూటర్ సంబంధ కోర్సులు నేర్చుకోవాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, కంప్యూటర్ శిక్షకుడు జాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు

‘సిద్ధన్న గట్టు’ సినిమా షూటింగ్

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో మన దర్శకత్వంలో కె.వెంకటరాముడు నిర్మాతగా తెరకెక్కుతున్న ‘సిద్ధన్న గట్టు’ సినిమా షూటింగ్ రెండో షెడ్యూల్ సోమవారం రుద్రవరం గ్రామంలో జరిగింది. సినిమా ప్రధాన తారాగణం సుమన్ తల్వార్, సుధ, అక్సాఖాన్, జేబీ, బైటింటి మీనాక్షిరెడ్డి షూటింగ్‌లో పాల్గొన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన దర్శక నిర్మాతలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా షూటింగ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతుంది. చిత్ర యూనిట్‌తో పాటు మారుతి, ఆర్ఆర్ఆర్ సింగర్ ప్రకృతి రెడ్డి, బేబీ సహస్ర, రాధిక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సుమన్‌కు స్వాగతం పలుకుతున్న నటులు మీనాక్షిరెడ్డి

నూతన విధానంతో విద్యా వ్యవస్థకు భంగం

గోనెగండ్ల : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానం వలన విద్యా వ్యవస్థకు భంగం కలుగుతుందే తప్ప లాభం చేకూరేలా లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు హాజరై ఆయన మాట్లాడారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారే తప్ప ఏ ఒక్క రాజకీయ నాయకుడికి కూడా ప్రజలకు మేలు చేసే చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాఠ్యపుస్తకాల్లో చరిత్ర కారుల పాఠ్య అంశాలను తొలగించడం చూస్తుంటే మనం చాలా సంవత్సరాలు వెనక్కి పోతున్నట్లు అనిపిస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సామాజిక స్పృహ కలిగి నిబద్ధతతో మెరుగైన సమాజం కోసం పాటు పడాలన్నారు. ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, నాయకులు రంగప్ప, అబ్దుల్లా, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డ్యామ్ అధికారులు సోమవారం తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న పూజారులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఇందులో రూ.15.23 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 72 రోజుల్లో అమ్మవారికి భక్తులు రూ.15,23,196 సమర్పించారని చెప్పారు. కానుకల లెక్కింపులో దేవస్థానం చైర్మన్ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో బొలెరో వాహనం ఢీకొని స్థానిక బీసీ కాలనీకి చెందిన లింగన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కోడుమూరులోని బీసీ కాలనీకి చెందిన లింగన్న మరో వ్యక్తితో కలిసి కర్నూలులో గౌండ పని ముగించుకొని బైక్‌పై కోడుమూరుకు వస్తుండగా పట్టణ సమీపంలోని పత్రప్పజిన్ను వద్ద కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. అయితే బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా కర్నూలు వైపు వెళ్లి పోయాడు. స్థానికులు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులుకు ప్రమాద విషయాన్ని తెలియజేయడంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

● సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చి పంపారు. అనంతరం సబ్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వారంలోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రమాదేవి, వలీబాషా, కౌసర్‌భాను, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఆర్టీసీ డీఎం మహ్మద్‌రఫీ, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన వినతుల్లో కొన్ని..

● కోసిగి మండలం సజ్జలగూడెం గ్రామానికి చెందిన నాగేంద్ర.. తనకు సంబంధించి చిర్తనకల్లు సర్వే నంబర్ 225/ఏలో 17.96 ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, దయచేసి విచారణ చేసి ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించాలని అర్జీ సమర్పించుకున్నాడు.

● మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన ఈరన్న.. తనకు సంబంధించి చాలా కాలం నుంచి ఇంటికి రస్తా ఉండగా ప్రస్తుతం ఇంటి రస్తాలో వేరేవారు ఇంటి నిర్మాణం చేస్తున్నారని, దయచేసి విచారణ చేసి రస్తా చూపాలని అర్జీ సమర్పించుకున్నాడు.

● ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామానికి చెందిన పరమేశ్వరయ్యకు చెందిన సర్వేనంబర్ 53లో 1.09 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆన్‌లైన్ అడంగల్‌లో వేరే వారి పేరు నమోదైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ ఇచ్చాడు.

● ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి నాడు–నేడు నిర్మాణ పనులు జరుగుతుండగా శౌచాలయం పైన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు పనులు జరుగుతుండగా వాటిపైన కరెంట్ తీగలు ఉన్నాయని, విద్యుత్ తీగలను తొలగించాలని ఆదోని పట్టణం హవన్నపేటకు చెందిన హెచ్ఎం నాగేష్ అర్జీ సమర్పించుకున్నాడు.


అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

జగనన్నతోనే పేదల సంక్షేమం

మంత్రాలయం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామంలో పర్యటించారు. 300 గడపలను సందర్శించి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఏవైనా సమస్యలుంటే చెప్పాలని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలంటే మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని నాల్గవ సారి అత్యధిక మెజార్టీతో గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీంరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ సీతారామిరెడ్డి, నాయకులు గురురాజారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, ఎంపీడీఓ ప్రభావతి పాల్గొన్నారు.


లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు ఆరా తీస్తున్న వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి

ఆలూరులో ఉరుములు మెరుపుల వర్షం

● నేలకొరిగిన చెట్లు
● విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు
● నిలిచిన విద్యుత్ సరఫరా

ఆలూరురూరల్: ఆలూరులో సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్‌తీగలు తెగిపోవడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోయనగర్‌లోని పీర్ల చావిడి, తాగు నీటి ట్యాంకు వద్ద రెండు విద్యుత్ స్తంభాలతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో స్తంభాలు పడిపోయాయి. ఈదురుగాలలకు చెట్లు నేలకూలాయి. మొలగవల్లి గ్రామంలో రెండు విద్యుత్ స్తంభాలు, హత్తిబెళగల్ గ్రామంలో మూడు స్తంభాలు విరిగిపోయినట్లు విద్యుత్ ఏఈ లోకేష్ తెలిపారు. అలాగే హాలహర్వి మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండ వేడిమి వల్ల ఉక్కపోతలతో అల్లాడిన జనం సోమవారం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు.


కోయనగర్ కాలనీలోని ట్యాంక్ వద్ద కూలిన విద్యుత్ స్తంభం


పీర్ల చావిడి వద్ద విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టు

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

కర్నూలు (రూరల్) : డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సూచించారు. సోమవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో డ్వాక్రా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడారు. జగనన్న ఆసరా పథకాన్ని అన్ని సంఘాలకు వర్తింపజేయాలన్నారు. మొదటి విడతలో 90 లక్షల మందికి రుణ విముక్తి కల్పించగా ఏప్రిల్‌లో విడుదల చేసిన మూడో విడతలో 74 లక్షల మందికి రుణ విముక్తి కల్పించారు. మిగిలిన వారికి కూడా అర్హతను ప్రామాణికంగా చేసుకుని అర్హులను గుర్తించాలన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని మూడు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలన్నారు. బ్యాంకు అధికారులు లోన్ ఇచ్చే సమయంలో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. అభయహస్తం పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలను గుర్తించి పెన్షన్లు ఇవ్వాలన్నారు. పొదుపు సంఘాల సమన్వయం, సాధికారత కోసం కృషి చేస్తున్న ఆర్పీలపై పని భారం తగ్గించి బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు టీఏ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అరుణ, షబానా, రషీద్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.


పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి